

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

06 జనవరి 2026 పేజీలు : 08


## రైతుల హక్కులు హరించే..

# ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశాం

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల హక్కులను హరించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. 'మీ భూమి మీ హక్కు' నినాదంతో ఆత్మకూరు రూరల్ మండలం నువ్వూరుపాడు గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలు తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలకు ఉన్న తేడాను రైతులకు అర్థమయ్యేలా మంత్రి ఆనం రైతులకు వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్ పుస్తకాలు చెల్లని నోటుతో సమానం.. విలువ లేనివన్నారు. తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్ పుస్తకాలు రిజర్వ్ బ్యాంకు జారీ చేస్తున్న కరెన్సీ నోట్ల వలె విలువ గలవని, భద్రతాపరంగా చట్టబద్ధత కలిగినవని, ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లో వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే భూయజమానికి సంబంధించిన అన్ని వివరాలు అప్పటికప్పుడే కనిపిస్తాయన్నారు. రైతుల భూ హక్కులకు చట్టబద్ధ భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 2026 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను పూర్తిగా

-మిగతా 2లో

# మేమింతే..!

## ఎవరొస్తే మాకేంటి ?

**ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రానికి వివిధ సమస్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి అర్జిదారులకు ఇబ్బంది కరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే ఆ ఆదేశాలను మాత్రం మండలం లోని కొందరు అధికారులు సమయ పాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.**



**సైదాపురం, మేజర్‌న్యూస్ :**

తమ తమ సమస్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి అర్జీదారులకు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అర్జీదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ ప్రతి సోమవారం ఆయా మండలాల్లోని

-మిగతా 2లో

- ప్రజల మనిషి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
- ఒకే వేదికపై అన్ని పార్టీల నాయకులను తీసుకురావడం గొప్ప విషయం
- విద్యార్థి నాయకుడిగా పోరాటాలు చేసి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు
- రహదారి ప్రమాదాలకు ఇక చెల్లుచీటి

## పొట్టేపాలెం బ్రిడ్జితో..

# లక్షల మందికి లబ్ధి






**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణంతో లక్షలాది మంది ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడడం సంతోషంగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రజల మనిషి కాబట్టే.. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవలో ఉన్నారన్నారు. అనుకున్నది సాధించే తత్వం కోటంరెడ్డికే సాధ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నగర ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సీపారెడ్డి వంశీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు పముజుల దశరథ రామయ్య, సీపీఎం

-మిగతా 2లో

## బకాయిలు ఉన్నవారిపై

# చట్టపరమైన చర్యలు

**కమిషనర్ వైఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం 108.82 కోట్ల రూపాయలు 15,737 అసెస్‌మెంట్ల నుంచి 10 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పరిధిలో జమ కావాల్సి ఉందని, మొండి బకాయిలను వసూలు చేయడానికి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు కమిషనర్ వై.ఓ నందన్ సోమవారం తెలిపారు. 10 వేల రూపాయలకు పైగా బకాయిలు ఉన్న మొండి బకాయిదారులకు ఇప్పటివరకు నోటీసులు జారీ చేసి ఉన్నప్పటికీ వారి నుంచి స్పందన రాకపోవడంతో సహేతుక కారణాలు తెలుసుకునేందుకు బకాయిదారులతో నేరుగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నట్లు

-మిగతా 3లో

# మేమింతే.. ఎవరొస్తే మాకేంటి ?

(మొదటి పేజీ తరువాయి)

తహసిల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయా మండలాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌కు అధికారులు కావాల్సి ఉంది. అయితే సైదాపురం మండలంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో అర్జీదారులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా అధికా రులు హాజరు కావాలి. అలా కాకుండా ఎవరైతే మాకేంటి.. మేమింతే ! అనే చందంగా కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అందుకు తార్కాణం సోమవారం (5వ తేదీ) అటెండెన్స్ రిజిస్టర్‌లో సైదాపురం తహసిల్దార్ సుభద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, హౌసింగ్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, ఐసీడీసీ ఫాతిమా, సీసీ శ్రీదేవి.. సుమారు 10 గంటల సమయానికి 5 శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరు కాగా.. మిగతా శాఖల అధికారులు ఏం చేస్తున్నట్లు ? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గిరిజనలు, దళితులు ఉన్న మండలం కాబట్టి వివిధ గ్రామాల్లో ఉన్న తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు గ్రీవెన్స్ డే కార్యక్రమానికి వచ్చి అర్జీ ఇద్దామంటే ఆయా శాఖల అధికారులు కనపడకపోవడంతో నిరాశతో అర్జీదారులు వెనుదిరిగాల్సిన పరిస్థితి ఉంది. మండల తహసిల్దార్ సుభద్ర మండల ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ, మిగతా మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు చుట్ట పు చూపుగా వచ్చివెళ్లడంతో అధికారుల తీరు పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జరిగే గ్రీవెన్స్ డేకి అధికారులు సమయపాలన పాటించకపోతే.. మిగిలిన రోజుల్లో వీరంతా విధి నిర్వహణలో ఉద్యోగానికి రావాలంటే ఏ సమయానికి వస్తున్నారు.. ఏ సమయానికి వెళ్తున్నారు.. మండల అధికారులు అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. గ్రీవెన్స్ డేకి హాజరు కాని శాఖల అధికారుల పట్ల మండల తహసిల్దార్ సుభద్ర.. ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

# రైతుల హక్కులు హరించే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతన్నలకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం వెల్లడించారు. నువ్వూరుపాడు గ్రామంలో మంత్రి ఆనం అంతర్గత సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఎవరూ ఊహించని విధంగా సూపర్ సిక్స్‌ను విజయవంతంగా అమలు చేశామని, ప్రజలపై భారం పడకుండా ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వమే కోట్లాది రూపాయలు చెల్లిస్తూ ఉచిత బస్సు..స్త్రీ నిధి పథకాన్ని అమలు చేస్తుందని అన్నా క్యాంటీన్ ద్వారా ఇప్పటివరకు నాలుగు కోట్ల మంది భోజనం చేశారని, కోట్లాది రూపాయలతో పింఛన్లు క్రమం తప్పకుండా అందిస్తున్నామని, గ్యాస్ సంస్థలకు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ ప్రజలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తుందని, త్వరలోనే మూడో విడత అన్నదాత సుఖీభవ నిధులు జమ చేస్తామని మంత్రి ఆనం పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్ ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేశామని, విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేసామని, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను కూడా భర్తీ చేశామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని, పోర్టులు, ఎయిర్‌పోర్ట్‌లు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు. ఆగస్టు నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని, దగదర్తిలో ఈ డిసెంబర్ చివరి



నాటికి విమానాశ్రయాన్ని పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి ఆనం పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తూ రామరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి ఆనం వెల్లడించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, ఆత్మకూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్రా రెడ్డి, సుంకర పెంచల చౌదరి, తెలుగుదేశం నాయకులు తాళ్లూరు గిరినాయుడు, ఆనం కైవల్యారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్ రెడ్డి, పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొండ్రెడ్డి రమణారెడ్డి, షేక్ ఖాజావలి, షేక్ మస్తాన్వాలి, మద్దినేని నారాయణ,తలచిరు బాబునాయుడు, దేవరపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా,తహసీల్దార్ పి. పద్మజా కుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, వ్యవసాయాధికారి కిషోర్ బాబు, విఆర్‌వో మురళీధర్ రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్ష శుక్ల, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డి.పి.ఓ వసుమతి, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు, పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లను జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతోపాటు షామియానాలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద 125 రోజుల పని దినాలకు సంబంధించి గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

# పొట్టేపాలెం బ్రిడ్జితో లక్షల మందికి లబ్ది

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా నాయకులు అరిగెల నాగేంద్ర సాయి, జనార్దన్, జనసేన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులతో కలిసి పొట్టేపాలెం కలుజువద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు వేమిరెడ్డి దంపతులకు రూరల్ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు, భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పొట్టేపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణం.. 25-30 ఏళ్ల కల అని, ఇన్నాళ్లకు అది సాధ్యమయిందన్నారు. గతంలో తనకు ఈ ప్రాంతంలో మైనింగ్ ఉండేదని, రహదారి ఇబ్బందుల వల్లే వదిలేశానన్నారు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇది సాధించారన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా.. అభివృద్ధికి నిధులు మాత్రం అందిస్తున్నారని చెప్పారు. ఒక్క పెన్షన్ల వరకే ఇప్పటివరకు 50 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. సంక్షమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం ముందుకు వెళు తున్నారని స్పష్టం చేశారు. 9 కోట్ల విలువైన బ్రిడ్జిని తగ్గించి.. పొట్టేపాలెం బ్రిడ్జి మంజూరు చేశారన్నారు. అది శ్రీధర్‌రెడ్డి పట్టుదలకు నిదర్శనమని చెప్పారు. ఎంతో పట్టుదల, ప్రజల పట్ల ప్రేమ ఉండబట్టే మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉండటం రూరల్ ప్రజల అదృష్టమన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా ఎంతో కష్టపడుతున్నారని, ప్రజల మనసు తెలుసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పాలిటిక్స్ అంటే ప్యాషన్ అని, అందుకే నిరంతరం ప్రజల మధ్య తిరుగుతూ వారి సంక్షమానికి పని చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు తప్పకుండా కొండాయపాలెం, బివి నగర్ ప్రాంతాల్లో రైల్వే అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎవరిని కలవాలన్నా కలుస్తామని ఆయన చెప్పారు. పొట్టేపాలెం బ్రిడ్జిని 8 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వైద్యం నిమిత్తం కేరళ వెళుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని, మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోరాట ఫలితమేనన్నారు. అసెంబ్లీలో పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జ్ నిర్మాణ సమస్యను లేవనెత్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని ఒప్పించి నిధులు సాధించారన్నారు. పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జ్ నిర్మాణం కోసం అన్ని రాజకీయ పార్టీలను మద్దతు కూడగట్టడం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కే సాధ్యమయిందన్నారు. కలుజుపై బ్రిడ్జి నిర్మాణం నెల్లూరు రూరల్ పరిధిలోని గ్రామాలకే కాక కోవూరు నియోజకవర్గంలోని జొన్నవాడ, మినగల్లు, పెనుబల్లి గ్రామవాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జొన్నవాడ ఆలయానికి వెళ్లే భక్తులకు ఎంతో సౌకర్యమని చెప్పారు. అలాగే ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ.. జిల్లాలో యువజన నాయకుడిగా ఉండి 30 సంవత్సరాల తరువాత ఎమ్మెల్యే అయిన ఒకేఒక్క యువజన నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని చెప్పారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి తామంతా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. అలాగే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి హామీని నెరవేర్చారన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం జనాల్లో ఉండటం తనకు ఇష్టమని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోననీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి విషయంలో రాజీ పడేదే లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, శ్రీ వేదగిరి లక్ష్మ నరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, టిడిపి నాయకులు కమలాకర్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, గునుగుల కిషోర్, క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జులు, డివిజన్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల శాంతి భద్రతల కొరకే.. కార్డన్ సెర్చ్ : డీఎస్పీ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని నెల్లూరుపాలెం టిడ్కో గృహాల వద్ద ఆత్మకూరు డీఎస్పీ కే. వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు కాటన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కాటన్ సెర్చ్‌లో భాగంగా మొత్తం 26 వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటిలో 23 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు అనుమానిత వ్యక్తులను కూడా విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కే.వేణుగోపాల్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కాటన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతాభావం పెంచడమే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. టిడ్కో గృహాల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతోపాటు ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్లు జిలాని, సాయి ప్రసాద్, సంగం సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్, చేజర్ల సబ్ ఇన్స్పెక్టర్ తిరుమలరావు, ఏఎస్ పేట సబ్ ఇన్స్పెక్టర్ సైదులు, సోమశిల ఇంచార్జ్ సబ్ ఇన్స్పెక్టర్ కాసా శ్రీనివాసుల రెడ్డి, అనంతసాగరం సబ్ ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్ రెడ్డి, పలువురు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలికి శ్రీహరి రెడ్డి ప్రేరణతోలక్ష్మమ్మ నేత్రదానం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం, వడ్డీపాలెంకు చెందిన కేరళ ఆయుర్వేద ఆసుపత్రి నిర్వాహకులు తురకా శ్రీనివాసులు తల్లి తురకా లక్ష్మమ్మ (82)ఐసోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. వెంటనే శ్రీనివాసులు రెడ్‌క్రాస్‌కు సమాచారమివ్వడంతో నేత్రదాన ఏర్పాట్లు చేశారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి కార్నియా రికవరీ స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలను సేకరించారు. సీనియర్ రెడ్ క్రాస్ సభ్యులు, బీజేపీ నాయకులు పల్లపు చిట్టిబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్ష్మమ్మ నేత్రదానం తమ ప్రాంతంలో పలువురికి స్ఫూర్తిదాయకం అవుతుందని అన్నారు. ఇది తమ వార్డులో జరిగిన రెండవ నేత్రదానమని, పలువురు నేత్రదానం పట్ల ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రెడ్ క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి నేత్రదాత కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. నేత్రదానంకు సహకరించిన ఆమె మనవళ్లు చంద్రశేఖర్, దేవి వరప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# కృష్ణా జల్లాలో సోమశిల కండలేరు డ్యామ్‌ల నీటి వాటాల సంగతి తేల్చాలి

### బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సోమశిల కండలేరులకు హక్కుగా రావలసిన నీటిని రాబట్టాలని సోమశిల ఎస్ఈ రమణారెడ్డికి బిజెపి నేత రమేష్ విజ్ఞప్తి చేశారు. అంతరాష్ట్ర ఒప్పందాల ప్రకారం చెన్నైకి నీరు ఇచ్చేందుకు మహారాష్ట్ర కర్ణాటక తెలంగాణ 12 టీఎంసీల కృష్ణా జలాలు కండలేరు డ్యామ్ కి ఇప్పటివరకు ఇవ్వనే లేదు. గత 30 సంవత్సరాలుగా ఒక్క టీఎంసీ నీటిని కూడా కండలేరుకి ఇవ్వలేదు. వరదలు వచ్చి పంటలు కొట్టుకుపోయి సముద్రంలో కలిసే నీటిని ఆంధ్రకు నీలిచినట్లుగా చూపడం మానవ సమాజాన్ని అవమాన పరచడమే అవుతుంది. చెన్నైకు నీరు విడుదల చేయాలన్న సోమశిలలో 17 టీఎంసీలు కనీసం నిల్వ ఉంటేనే సాధ్యమవుతుంది. కండలేరు నుండి చెన్నైకి నీరు విడుదల చేయాలంటే 8.5 టీఎంసీల నీరు ఉంటేనే సాధ్యపడుతుంది. చెన్నైకు ఇవ్వవలసిన 15 టిఎంసీలు వాస్తవానికి ఏ రాష్ట్రాలు ఇవ్వలేదు. సోమశిల కండలేరులలో తప్పనిసరిగా 25 టిఎంసిలు అంతర్ రాష్ట్ర ఒప్పందాలకు అనుగుణంగా కృష్ణా జలాలు నిల్వచేయాలి. 40 టీఎంసీలు కృష్ణా జలాలపై సోమశిల కండలేరు డ్యాములు హక్కులు కలిగి ఉన్నాయి. ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపు అప్పర్ బద్ర లిఫ్ట్ ఇరిగేషన్‌లు పూర్తి అయితే తీవ్రమైన నీటి సంక్షోభం ఏర్పడుతుంది. తెలంగాణలో నీటి కోసం ఓట్ బ్యాంకు రాజకీయాలు కాంగ్రెస్ బిఆర్ఎస్‌లు చేస్తున్నాయి. సముద్రంలో కలిసే నీటి మళ్లింపుతో నల్లమల సాగర్ నిర్మిస్తామంటే ఆంధ్రను తెలంగాణ కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. నిజంగా తెలంగాణ వాదులకు చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక ప్రాజెక్టుల వలన 300 టిఎంసిలు కృష్ణా జలాల కొరతపై పోరాడాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి. నారాయణ యాదవ్, నీలి శెట్టి లక్ష్మణరావు. బుధవరపు బాలాజీ, టి.శ్రీనివాసులు చింతగింజల సుబ్రమణ్యం ప్రశాంత్ ధనుంజయ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సెల్ఫీ బూతును ప్రారంభించిన ఎమ్మెల్యే




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగంగా కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలను ప్లాస్టిక్ నిషేధం మరియు స్వచ్ఛ సర్వేక్షన్ పై చైతన్యపరిచేందుకు సోమవారం 17వ వార్డు బుడమగుంట నందు స్వచ్ఛ సెల్ఫీ బూత్‌ను కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రజలు ప్లాస్టిక్ రహిత కావలిగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని నల్లపాలెం, బత్తులపల్లి అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పొదలకూరు పోలీసులు సోమవారం సాయంత్రం మెరుపు దాడి జరిపారు. అసాంఘిక కార్యక్రమాలపై పొదలకూరు పోలీసులు నిఘా పెంచారు. బత్తలపల్లి అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై మహమ్మద్ హనీఫ్ తన సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. కోడి పందాలు ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు కోళ్ళు, 8 బైక్‌లు, రెండు ఆటోలు, రూ.12,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పెంచలకోన దేవస్థానంకు రూ. 41,98,168 రాబడి



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలోని శ్రీపెనుశిల లక్ష్మి నృసింహా స్వామివారి ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 4వ తేదీ నుండి ఈ ఏడాది జనవరి 5వ తేదీ వరకు 31 రోజుల కుగాను స్వామివారి, అమ్మవారి, ఆంజనేయ స్వామివారి ఆలయాలలో ఉన్న హుండీలు లెక్కింపు ద్వారా మొత్తం రూ. 41,98,168లు నగదు, మిక్స్ బంగారు ఆభరణములు 000.013.000మిల్లీ గ్రాములు, వెండి ఆభరణములు 001.600.000 మిల్లీ గ్రాములు, విదేశీ కరెన్సీ యుయస్ఏ 1డాలర్ -1, మాల్దీవ్ మోరిటర్ ఆథారిటీ- 10, రుఫియా-1,బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండ్ 10 పౌండ్స్-1, నేపాల్ రాష్ట్ర బ్యాంక్ -50 రూపీస్-1 ,కువైట్ క్యూటర్ దినార్స్ -2, అన్నదానం, హుండీ లెక్కింపు ద్వారా రూ.4,13,750లు ఆదయం వచ్చినదని దేవస్థానం ఉప కమీషనర్ అండ్ కార్యని ర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. హుండీల లెక్కింపు ద్వారా వచ్చిన మొత్తమును ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లోని పెంచలకోన బ్రాంచ్ కు జమ చేయడం జరిగిందని దేవస్థానం ఏసీ అండ్ ఈవో ప్రకటనలో పేర్కొన్నారు. హుండీ లెక్కింపునకు పర్యవేక్షణ నిమిత్తం నెల్లూరు వేణుగోపాల స్వామివారి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ జే. శ్రీనివాసరావు, వెల్లంపల్లి గ్రేడ్ -3 పీ శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారని దేవస్థానం ఏసి అండ్ ఈవో తెలిపారు. ఈ లెక్కింపునకు ప్రధాన అర్చకులు, పెంచలకోన పోలీస్ ఔట్ పోస్ట్ సిబ్బంది, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు

*(మొదటి పేజీ తరువాయి)*

తెలిపారు. మొండి బకాయిలు ఉన్నవారు పన్నుల మొత్తాన్ని ఆఖరి అవకాశంగా భావించి సంబంధిత కార్యాలయంలో ఇప్పటికైనా చెల్లించాలని కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థకు బకాయిలు ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని కమిషనర్ హెచ్చరించారు.

# వింజమూరు ఎంపీపీగా హైమావతి ఏకగ్రీవం

● నాటకీ పరిణామాలు మధ్య ఎన్నిక ● ముగిసిన ఉత్కంఠ






**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో వనిపెంట హైమావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. ఈ ఎన్నికల పరిశీలకులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు రిటర్నింగ్ అధికారిగా నిర్మలాదేవి సహాయ రిటర్నింగ్ అధికారిగా ఎంపీడీఓ కే.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షులు వింజమూరు ఒకటవ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు ఆనంది రమణయ్య హైమావతి పేరును ప్రతిపాదించగా మండల ఉపాధ్యక్షురాలు శంఖవరం ఎంపీటీసీ సభ్యురాలు బసిరెడ్డి సుమలత బలపరిచారు. దాంతో వనిపెంట హైమావతి నామినేషన్ ఒక్కటే ఉండడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సోమవారం ఉదయం నుండి ఉత్కంఠ భరితంగా వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొన్ని రోజులుగా జరుగుతున్న రాజకీయ హై డ్రామా క్యాంపులు ముగిసి ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ, వైసీపీ మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ పోరు సాగింది ఇరు వర్గాలు తాము బలపరిచిన వ్యక్తి కావాలని ఉద్దేశంతో తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేశారు. ముందుగా ముందుగా సమావేశం మందిరానికి వనిపెంట హైమావతి సాధం మౌనిక పల్లా పురుషోత్తం బసిరెడ్డి సుమలత కాటం ప్రసన్నలు హాజరయ్యారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి పల్లాల కొండారెడ్డి దేగ వంశీ ఉంటా రత్నమ్మ ఏకశిరి భవాని హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లాల కొండారెడ్డి అధికారులతో మాట్లాడుతూ.. తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులు గవ్వల మల్లికార్జునను ఎవరో కిడ్నాప్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు అధికారులు సమావేశ మందిరానికి వచ్చిన ఎంపీటీసీలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. దాంతో కొండారెడ్డి తన ఎంపీటీసీలతో బయటకు వెళ్లి పోయారు కొద్ది సేపటికి పోలీసులు సమావేశ మందిరానికి రానివ్వకపోవడంతో ఆందోళన చేశారు దాంతో పోలీసులు అనుమతి ఇవ్వడంతో మరల సమావేశ మందిరానికి వచ్చారు తమ పార్టీకి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తున్న సమయంలో అధికారులు ఆ విషయాన్ని తమ దృష్టికి ముందుగా తీసుకుని వస్తే బందోబస్తు కల్పించేవారనన్నారు. ఈ సమయంలో ఆనంది రమణయ్య సమావేశ మందిరానికి విచ్చేశారు. 6 మంది ఎంపీటీసీలు కావడంతో సమయం మేరకు ఎన్నికల ప్రక్రియను అధికారులు ప్రారంభించారు వనిపెంట హైమావతి రిటర్నింగ్ అధికారుల నుండి డిక్లరేషన్ ఫారం అందుకుని ప్రమాణస్వీకారం చేశారు కనిగిరి సీఐ వెంకటనారాయణ ఎస్ఐ వీర ప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వింజమూరు టీడీపీ అభ్యర్థి ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. నూతన ఎంపీపీకి నిలిచిన ఎంపీటీసీలకు నాయకులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం వనిపెంట వెంకటసుబ్బారెడ్డిని హైమావతిని నిధులను ఎంపీటీసీలను స్థానికులు నాయకులు ఘనంగా సత్కరించారు.

# నేదురుమల్లి జనార్దన్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి



**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి**

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాలెం బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆహ్వానం మేరక నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తొలిసారిగా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరంగా ఉందన్నారు. ఇలాంటి కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నెల్లూరులో గతంలో రాజకీయాలు హుందాగా ఉండేవని, ఆలోచించిన హుందాతనాన్ని తిరిగి తీసుకురావాలని కోరుకునే వ్యక్తిని కాబట్టే ఈ అభివృద్ధి కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా హాజరు కావడం జరిగిందని తెలియజేశారు. అంతేకాకుండా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులలో పనిచేసిన వ్యక్తిని అందుకే మేము, మా కాంగ్రెస్ వారిని శ్రీధర్ గానే చూస్తామని, ఒకప్పటి కాంగ్రెస్ వాదిగా శ్రీధర్‌కి విన్నవిస్తున్నాను.. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ నేత.. మన నెల్లూరు వాసి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి మరణాంతరం ఇప్పటివరకు నెల్లూరు టౌన్‌లో ఆయన విగ్రహం లేకపోవడం శోచనీయమని.. మన నెల్లూరు వాసి అయినటువంటి ఆయనని గౌరవించి విగ్రహం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన అన్ని పార్టీల నాయకులను కోరారు.

## వికసిత్ భారత్ జీ రామ్ జీ పై అవగాహన

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఇనుకుర్తి పంచాయతీలో సోమవారం  వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ ఎంపీడీవో ఎస్వీఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ జి రామ్ జి పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీ ఈ పథకం ద్వారా లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి ఏడాదిలో 125 పని దినాలను కల్పించడం జరుగుతుందని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ ఆళ్లం సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి డి.బాలకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ హేమలత, వెటర్నరీ అసిస్టెంట్ రేష్మ, ఏపీవో ఎం.శిరీష, గ్రామ నాయకులు వెన్నపూస పెంచల్ రెడ్డి, ఆళ్లం గోపాల్ రెడ్డి, ఆళ్లం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సుభాన్



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నూతన బార్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బార్ అసిసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ సుభాన్ బాషా, ఉపాధ్యక్షుడిగా మల్లెల అశోక్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల కిరణ్ బాబు, కార్యదర్శిగా వల్లెపుశెట్టి నాగార్జున, కోశాధికారిగా షేక్ అల్తాఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సంఘ అభివృద్ధికి తమవంతు కృషి చేసా మని నూతన కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## నామినేషన్ల పర్వం ప్రారంభం

● ఫిబ్రవరి 13న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సోమవారం నుండి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఎన్నికలు 2026 ఫిబ్రవరి 13న జరుగుతాయి. ఈ మేర కౌన్సిల్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేశారు. షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. 2026 జనవరి 5 నుంచి 13 వరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నుండి నామినేషన్ స్వీకరిస్తారు. ఉదయం 10:30 నుంచి 5 గంటల లోపల నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంది. హైకోర్టు ఆవరణలో ఉన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి ఎదుట నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంది. జనవరి 16 ,17 తేదీలలో రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో అడ్వకేట్ జనరల్ సమక్షంలో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను సాయంత్రం 4 గంటల వరకు పరిశీలిస్తారు. 17వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు అర్హత గల అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. జనవరి 19, 20 తేదీ సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లకు ఉపసంహరణ గడువు ఇచ్చారు. జనవరి 21 రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ బరిలో ఉన్న అభ్యర్థుల ఫైనల్ లిస్టును ప్రకటిస్తారు. 2026 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరుగుతాయి. ఫిబ్రవరి 16న రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ మేర రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల అధికారి, రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవి శేష సాయి ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు నుంచి ఆరుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నట్లు సమాచారం.

## టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌లను ఎంఈఓలు కొండయ్య, రమణయ్యలు చేతులు మీదగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహుజన మండల శాఖ ప్రతినిధులు తమను తాము ఎంఈఓలను పరిచయం చేసుకొని గౌరవంగా సన్మానించారు. ఈ సందర్భంగా బహుజన మండల ప్రెసిడెంట్ బెజవాడ జైపాల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం పోరాడుతుంటామని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాలతో అందరికీ విద్యను అందించే ఉద్దేశాలతోనూ, అలాగే విద్య దాత అయిన మహాత్మ జ్యోతి బాపూలే యొక్క ఆశయాల సాధన కోసం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి ప్రదీప్, కేశవమూర్తి, మాలకొండయ్య, రాధాకృష్ణమూర్తి, ఏడుకొండలు, ప్రభాకర్ ప్రభాకర్, హరీష్ కార్యదర్శులు కోలా సుజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 51 అర్జీలు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పాల్గొని అర్జీ దారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడు తూ.. అర్హులైన లబ్ధిదారులందరూ టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహాలు మంజూరు అయిన ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొని గృహాలలో ప్రవేశం చేయాలని కమిషనర్ సూచించారు. అనధికార లేఔట్ల లోని ప్లాట్ల యజమానులు, పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను అతిక్ర మించి నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులు ఎల్‌ఆర్ఎస్, బి.పి.ఎస్ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని, పథకాల ఆవశ్యకతపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. బి.పి.ఎస్ పథకంపై వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు డోర్ టు డోర్ తిరిగి అవగాహన కల్పిస్తున్నారని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న నక్ష సర్వే కు ప్రజలందరూ సహకరించి తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అందజేయాల్సిందిగా కమిషనర్ సూచించారు. ఆస్తులకు సంబంధించిన సరిహద్దు వివాదాలు, ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా ఆస్తి యాజమాన్య హక్కు పత్రాన్ని నక్ష సర్వే ద్వారా అందజేయన్నామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షమ పథకాలను అర్హులకు అందజేసేందుకు నగరవ్యాప్తంగా యూనిఫైడ్ సర్వే చేపడుతున్నారని ప్రజలు తమకు సంబంధించిన పూర్తి వివరాలను సచివాలయ కార్యదర్శులకు సర్వే ద్వారా అందజేసి సహకరించాలని కమిషనర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 1, టిడ్కో హౌసింగ్ 17, టౌన్ ప్లానింగ్ 20, రెవెన్యూ 1, ఇంజనీరింగ్ 5, పబ్లిక్ హెల్త్ 5, ఆప్కాస్ 1, పెన్షన్ 1, మొత్తం 51 వినతులను కమిషనర్ స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, ఈఈ శేషగిరి రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టిపిఆర్ఓ వాసు బాబు,పట్టణ ప్రణాళికా విభాగం ఇంచార్జ్ సిటీ ప్లానర్ రఘునాథ రావు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 124 ఫిర్యాదులు





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 124 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య,లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సీఐ భక్తవత్సవ రెడ్డి, మహిళా స్టేషన్స్ సీఐ సుబ్బారావు,మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కావలి పరిధికి చెందినటువంటి మహిళను, తన బంధువైన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తన ఫోన్ నెంబర్ తీసుకొని తరచు మాట్లాడుతూ.. సన్నిహితంగా ఉంటూ తను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా చనువుగా ఉండేవాడని, ఇప్పుడు పెళ్లి చేసుకోకుండా మొహం చాటేస్తూ దూరం పెడుతున్నాడని, అడిగితే తన కుటుంబ సభ్యులతో కలిసి గొడవకు వస్తున్నాడని, బెదిరిస్తూ ఇబ్బంది పెడుతున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నెల్లూరు రూరల్ పరిధికి చెందినటువంటి మహిళను, తన యొక్క ఫోన్ నెంబర్ ని గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని, అర్ధరాత్రి వేళ ఎక్కువగా అనామకుల కాల్స్, మెసేజులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని, అసభ్యకర మెసేజ్లు పంపిస్తున్నారని మానసికంగా వేధిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.



- సైదాపురం పరిధికి చెందినటువంటి వృద్ధుని, తనకు ముగ్గురు కుమారులని, ఒక పెళ్లి కాని కుమార్తె తనతో ఉన్నట్లు, తన కుమారుడు శ్రీను తన ఉంటున్న ఇంటి నుండి తరిమేసినట్లు, ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నట్లు, వేధిస్తున్నారని, తన జీవనోపాధి కోసం ఇచ్చిన ఇంటిని తిరిగి ఇప్పించాలని కోరారు.
- పొదలకూరు పరిధికి చెందినటువంటి మహిళ, హాస్పిటల్లో పనిచేస్తున్నట్లు, అదే హాస్పిటల్లో పనిచేస్తున్న నూరుల్లా అనే వ్యక్తి తనతో అన్నలాగా ఉంటూ, తన యొక్క ఫోన్ ని తీసుకొని, వాట్స్ యాప్ లాగిన్ చేసుకున్నాడని, మూడు నెలల క్రితం తనకి పెళ్లి కుదిరినట్లు, తన కుటుంబ సభ్యులకు చేడుగా ప్రచారం చేస్తున్నట్లు, తను చేసుకోబోయే భర్తతో కూడా తప్పుగా చెప్పినట్లు, మానసికంగా వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళను, అత్త మానసికంగా వేధిస్తుందని, తన భర్త అనుమానిస్తూ ఇబ్బంది పెడుతున్నాడని అంతేకా కుండా తన భర్త, తన యొక్క వ్యక్తిగత ఫోటోలు సోషల్ మీడియాలో పెడతా నని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- గూడూరు రూరల్ పరిధికి చెందినటువంటి మహిళను, సైదాపురం పరిధికి చెందినటువంటి వినోద్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు, పెళ్ళైన రెండు నెలల తర్వాత భర్త కువైట్‌కి వెళ్ళినట్లు, వెళ్ళిన తర్వాత వీసా పంపించి నిన్ను కూడా తీసుకెళ్తానని నమ్మబలికి మూడు సంవత్సరాలైనా తీసుకొనిపోలేదని నిలదీయగా, అత్త మామ, ఆడపడుచులతో కలిసి 10లక్షలు అదనపు కట్నం తెస్తేనే కువైట్‌కి తీసుకెళ్తానని ఇబ్బంది పెడుతున్నట్లు, కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.
- చిల్లకూరు పరిధికి చెందినటువంటి మహిళ, తనకు ఏడు సంవత్సరాల క్రితం పెళ్లి అయినట్లు, తన భర్త ఇంటి నుండి ఎటో వెళ్లిపోయాడని, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

## సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** భవిష్యత్తులో మానవ మనుగడ కొనసాగాలంటే ఆరోగ్యంతో పాటు ఆదాయం కోసం కొన్ని ప్రకృతి వ్యవసాయ పంటలే జీవననాడిగ నిలుస్తాయని ఎంఎంటి సుబ్బయ్య తెలిపారు. సోమవారం సైదాపురం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎం రాధా ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియా వాడకం తగ్గించి తక్కువ ఖర్చుతో సేంద్రీయ పద్ధతుల్లో ఎరువులను ఉపయోగించాలన్నారు. ప్రతి రైతు సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి చేసుకొని పంటలు పండించి పర్యావరణ పరిరక్షణతోపాటు ప్రతి రైతు ఆర్గానిక్ వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం ఎంఎంటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి సేద్యంలో జీవన ఎరువులు జీవ అమృతంతో వేసిన వరి ఆకుకూర మొదలగు పంటల సంబంధించి మానవ జీవనశైలికి ఎంతో ఆరోగ్యకరమని అందరూ కూడా ప్రకృతి సేంద్రీయ వ్యవసాయపరమైన ఆహారం తీసుకుంటే కొంతమేర అనారోగ్య పరమైన పరిస్థితులకు దూరంగా ఉండవచ్చని మండల సమైక్య సమావేశంలో ఏపిఎం రాధా ఏవోలకు, సీసీలకు ఏపీఓ రాధా తెలిపారు.

## పంచాయతీ బస్టాండ్‌లో అంగళ్లు క్రమబద్ధీకరించండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో అంగళ్లను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ ప్రజా విజ్ఞప్తి దినంలో బిజెపి ఫిర్యాదు చేసింది. బిజెపి నేత మిడతల రమేష్ ఆధ్వర్యంలో మండల బిజెపి శాఖ ప్రభుత్వం దృష్టికి బస్టాండ్ సమస్యను తీసుకువెళ్లారు. పంచాయతీ బస్టాండ్ సెంటర్లో ఆర్టీసీ బస్సులు నిలుస్తాయి. ప్రతిరోజు సాయం సమయంలో విద్యార్థులు వ్యాపారస్తులు గ్రామస్తులతో పంచా యతీ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. అంగళ్ళ వరకు ఉన్నాయి.. ఆ అంగళ్లు వరుస క్రమంలో లేకుండా ముందు వెనుకకు ఉండడం వలన ప్రత్యేకంగా పాఠశాల కళాశాల విద్యార్థులు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. మా వ్యాపారంగలకు అడ్డంగా ఉన్నారని అంగడి నిర్వహకులు విద్యార్థులను నిలబడవద్దని పక్కకు జరగమని చెప్తున్నారు. వాస్తవంగా విద్యార్థులకు ఆ ప్రాంతంలో నిలబడడం తప్పనిసరి అవుతుంది. ప్రజల రద్దీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్ సెంటర్లోని అంగళ్లను క్రమబద్ధీకరించాలని బిజెపి నేత రమేష్ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి చట్టంపై గ్రామ సభలు



**వరికుంటపాడు, మేజర్ న్యూస్ :** మండలంలోని కృష్ణంరాజు పల్లి పంచా యతీలో కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజి వికా మిషన్ పథకంపై గ్రామంలో ఉండే ఉపాధి కూలీ లకు ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశాలను మండల ఏపీవో ఆజాం ఖాన్ వివరిస్తూ ఉపాధి పని కోరిన తర్వాత కల్పించకపోతే శ్రామికుని ఖాతాకు భృతి జమవుతుందని. కూలీల వేతనాలను సమయానికి చెల్లింపులు గ్రామస్థాయిలో ప్రణాళిక తయారీ, పనులను పనులను కేటగిరీలుగా విభజించడం, వ్యవసాయం కూలీలను సమన్వయం చేయడం వంటి విషయాలతో పాటు గతంలో 100 రోజులు పనికి బదులుగా వచ్చే ఏప్రిల్ నుండి 125 రోజులకు పెంచే విధంగా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందికి వెంకటనారాయణ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ గుబిలి లక్ష్మయ్య ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దగదర్తి విమానాశ్రయ భూములు కోల్పోయిన

# రైతులకు నష్టపరిహారం రెట్టింపు ఇవ్వాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం దామవరం చెందిన విమానాశ్రయం భూముల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం రెట్టింపు చెల్లించాలని తెలిపారు. సోమవారం కావలి ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. 2013 భూ పరిహార చట్టం కింద భూ నష్టపరిహారం ఇస్తున్నారని వారు తెలిపారు. ఎకరాకు 13లక్షలు ఇవ్వడం అన్యాయమని అన్నారు రైతుల పట్టా భూములకు ఇచ్చే 25లక్షల రూపాయలు ప్రతి ఎకరాకి ఇవ్వాలని 2016లో విమానాశ్రయ భూములకు ఇచ్చిన పరిహారం ఆ ప్రాతిపదికన ఇవ్వకుండా 2026 రెట్లు ప్రకారం ఇవ్వాలని ప్రతి కుటుంబంలో చదువుకొని అర్హత కలిగిన విద్యార్థులకు ఉద్యోగం ఇవ్వాలని పరిహారం రెట్టింపు ఇవ్వాలని, బ్రోకర్ల బెడద తగ్గించాలని కోరారు. ఈ విషయంపై ఆర్డిఓ కలెక్టర్ డిస్టిక్ తీసుకువెళ్లి గ్రామ సభ పెట్టి అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లీ, శ్రీనివాసరెడ్డి, చంద్ర, బి.వెంకయ్య మాలిపాటి గణేష్ నాయుడు, మక్కినేని వెంకయ్య, నెల్లూరు రమణారెడ్డి, జె.శ్రీనివాస్ రెడ్డి భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో మరో సౌకర్యం కల్పించిన కంచి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో స్వంత నిధులు కొట్లాదిగా వెచ్చించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి తాజాగా గర్భిణీ, వృద్ధ మహిళలకు మరో సౌకర్యం కల్పించారు. ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి నిత్యం 750 మందికి అన్ని రకాల రుచులతో భోజనం ఏర్పాటు చేస్తుండగా అందుకుగాను 65లక్షల రూపాయలతో భవనం నిర్మించి స్థాండ్ టేబుల్స్ కూడా ఏర్పాటు చేశారు. ప్రజా సేవలో మరో మైలు రాయిగా గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక డైనింగ్ హాల్ను నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి తాజాగా ఏర్పాటు చేశారు. అన్ని దానాల్లో అన్నదానం మిన్న అనే భావనను ఆచరణలో చూపిస్తూ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి మరో అడుగు ముందుకు వేశారు. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ట్రస్టు అన్నదానం భవనంలో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, చిన్నపిల్లలు భోజనం చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేసి విచ్చేసిన గర్భిణీలకు వృద్ధులకు వారి యొక్క హస్తాలతో ప్రతి ఒక్కరికి వడ్డించి వారి యొక్క ఆప్యాయతను పంచి వారి సేవా మనసును చాటుకున్నారు. సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి సేవలకు ప్రజల నుంచి హృదయపూర్వక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రతి అర్జీని క్షణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిపిఓ వసుమతి, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్ .ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద 125 రోజుల పని దినాలకు సంబంధించి గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునీయులకు సన్మానం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం మార్కండేయ పురం పాఠశాలలో భోజన విరామ సమయంలో సోమవారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే ఘనతను వారి త్యాగాన్ని వివరించారు. అందరూ వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. శ్రీరాం పురం ఉపాధ్యాయులు మాల్యాద్రి బాల, బాలికలకు పెద్దలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు చెన్న కిష్టయ్య ఉపాధ్యాయుడి రామకృష్ణారెడ్డిలో సేవా గుణాన్ని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను పూల బొకేలతో, దృశ్యాలవతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థిని, విద్యార్థులు ఇష్టపడి కష్టపడి క్రమశిక్షణతో, విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థులకు బట్టలను వితరణ చేసిన ఉపాధ్యాయులు మాల్యాద్రిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక ముసునూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ 64 మంది లబ్ధిదారులకు 38 లక్షల 68,372 రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అర్హులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసీపీ పాలనలో 9సార్లు విద్యుత్ బిల్లును పెంచారని, వైసీపీ ప్రభుత్వం ప్రజలపై 32 వేల కోట్ల భారాన్ని మోపిందని ఎవరు చేయని లూటీని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేశారని తెలిపారు. ఒక విద్యుత్ శాఖలోనే ఒకకోటి 29 లక్షల నష్టం వాటిల్లిందని ఉమ్మడి ప్రభుత్వ పాలనలో విద్యుత్ అన్ని విధాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ యూనిట్లు అందిస్తామని కావలి నియోజకవర్గంలో 9 వేల ఇళ్లను సోలార్ పథకానికి అర్హులని తెలిపారు. బీసీలకు సోలార్ కోసం రుణాలు మంజూరు చేయిస్తామని, ప్రతి ఇంటికి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15శాతం నిధులతో డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేసుకోవచ్చు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామపంచాయతీలో ఉండే నిధుల్లో 15శాతం మేరకు నిధులు ఖర్చు పెడుతూ డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేసుకునే అవకాశం ఉందని కృష్ణపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శి రావుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ వజ్రమ్మ అధ్యక్షతన పంచాయతీ అధికారులు గ్రామసభ నిర్వహించారు. స్వచ్ఛ సంక్రాంతి సంబరాలు, వికసిత్ భారత్ జి రామ్ జి అంశం పైన గ్రామ సభను నిర్వహించగా వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడారు. గ్రామపంచాయతీలో రెండు కోట్ల రూపాయలు నిధులు ఉన్నాయన్నారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తూనే ఉంటామన్నారు. వార్డు సభ్యుల అభిప్రాయం కూడా తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. అనంతరం గ్రామస్తులు కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, వీఆర్వో ఉమాదేవి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 108, 104 సేవలపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఖండించిన జనసేన

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈరోజు 108, 104 అంబులెన్స్ సేవలపై వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు, దుష్ప్రచారాన్ని ప్రజల ముందు ఎండగట్టేందుకు నెల్లూరు జిల్లా జనసేన పార్టీ కార్యాలయం ఆధ్వర్యంలో నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ అంబులెన్స్ సర్వీస్ సెంటర్ వద్ద ప్రెస్‌మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, కాకూ మురళిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ నేతలు అంబులెన్స్‌లకు సంబంధించిన పాత, శిథిలమైన ఫోటోలను చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది పూర్తిగా దుష్ప్రచారమేనని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం 41 (108) అంబులెన్సులు, 43 (104) సంచార ఆరోగ్య వాహనాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంబులెన్స్ సిబ్బంది కూడా స్పందిస్తూ ఉ అత్యవసర కాల్స్‌కు లివెంటనే స్పందించి, ఎలాంటి ఆలస్యం లేకుండా సేవలు అందజేస్తున్నామని, గత ప్రభుత్వంతో పోలిస్తే



లిలిప్రస్తుత ప్రభుత్వంలో సేవలు మెరుగ్గా ఉన్నాయని, అలాగే లిలిజీతాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మాట్లాడుతూ ఉ తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రస్తుత ప్రభుత్వంలో పని పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జ్ జమీర్‌తో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అంబులెన్స్ జిల్లా మేనేజర్ అశోక్, ఫ్లీట్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడే అత్యవసర సేవలపై రాజకీయాలు చేయడం బాధాకరమని, నిజాలను ప్రజలు గమనించాలని జనసేన నాయకులు ఈ సందర్భంగా కోరారు.

# సహకార సంఘ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కేంద్ర సహకార బ్యాంకు ఎదుట ఉదయగిరి ప్రాంతంలోని వ్యవసాయ పరపతి సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సహకార సంఘాల్లో 2019 నుంచి పని చేస్తున్న ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవోలు పోలయ్య, లోకనాథెడ్డి, ఎస్.శ్రీనివాసులు, రత్తయ్య, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలతో రైతులకు న్యాయం : టీడీపీ యువ నేత గిరీష్



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పొట్లపూడి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడిందని టిడిపి యువ నేత నాసిన గిరీష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో జరిగిన భూ సర్వేలో అనేక లోపాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని, పాస్ పుస్తకాలపై మాజీ ముఖ్యమంత్రి ఫోటో ఉండటంతో రైతుల్లో అనవసరమైన ఆందోళన నెలకొందని గిరీష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ లోపాలను సరిదిద్దుతూ 22ఏ సవరణకు జీవో జారీ చేసి రైతులకు భరోసా కల్పించిందన్నారు. ఈ సవరణ ద్వారా రైతులతో పాటు మాజీ సైనికులు, ఇతర వర్గాలకు కూడా న్యాయం జరుగుతుందని గిరీష్ వివరించారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా కృషి చేస్తున్న టీడీపీ యువ నేతగా గిరీష్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుధీర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ యశ్వంత్, బుట్టి మల్లికార్జున, ఈగ కృష్ణయ్య, కేతగాని వెంకటరమణయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణం తొలగించాలని వినతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని సచివాలయం 6/2లోగల మాలకొండరెడ్డి నగర్ వీధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నూతన నిర్మాణంను తొలగించాలని సోమవారం కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో పిట్టి రాము మరో 10 మంది స్థానికులు కమిషనర్ వైఓ నందన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన అనుమతులకు విరుద్ధంగా సవిటి కాలుపైన, రోడ్డును ఆక్రమించి, ఇంటి ముందు సెట్ బాక్స్‌ను లేకుండా నిర్మిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణానికి ప్రోత్సహించిన టౌన్ ప్లానింగ్ టిపిబిఓ, ప్లానింగ్ కార్యదర్శి లపైన శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆక్రమణ నిర్మాణంను తొలగించాలని ఫిర్యాదు పేర్కొన్నామని వారు తెలిపారు.

# బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా జనతా వారధి కార్యక్రమం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీస్కెల్లి వారి సమస్యలు పరిష్కరించడమే బిజెపి 'జనతా వారధి' లక్ష్యం. భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రతి సోమవారం ప్రజలసమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి గ్రీవెన్స్ ద్వారా తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తెలియచేసినారు.ప్రజలు తమ సమస్యలను బీజేపీ నాయకులు, కార్యకర్తల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలకు పరిస్కరించుకోవాల చేసిందిగా కోరుతున్నాం. ఈరోజు బిజెపి నెల్లూరు జిల్లా జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రజల దగ్గర నుంచి ముఖ్యంగా దివ్యాంగుల పింఛన్లు, మంగల దరువు వద్ద స్థల యజమాని సమస్య, గుండె మార్పిడి చేయించుకున్న వారికి పింఛన్ మొదలగు అర్జీలను స్వీకరించి ఫిర్యాదుదారులతో కలిసి గౌరవనీయులైన జిల్లా కలెక్టర్‌కి సమస్యలను తెలియజేసి సత్వరంగా వారికి న్యాయం చేయాలని కోరడం జరిగింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు మున్సిపల్ కమిషనర్‌ని కలిసి కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యల యొక్క విజ్ఞప్తులను సమర్పించి న్యాయం చేయవలసిందిగా కోరడం



జరిగింది. ఈ కార్యక్రమంలో ముక్కు రాధాకృష్ణ గౌడ్, యశ్వంతసింగ్, ఎన్‌సీ పెంచలయ్య, మండ్ల ఈశ్వరయ్య, కరణం సుభాషిని, మొగరాల సురేష్,హర్షవర్ధన్, చిన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షులు సుధీర్, మింగాకిరణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళితుల భూమికి దారి అడ్డగింత

## దారి కల్పించాలని తహసిల్దార్‌కు వినతి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఇరువురు ఎస్సీ కాలనీ సమీపంలో దళితులకు సంబంధించిన వ్యవసాయ భూమి సర్వే నంబర్ 512-1 భూమిలోకి వెళ్లేందుకు ప్రకాశం జిల్లా సిఎస్ పురం మండలం ఆనికాలపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి కాశిరెడ్డి, చెరుకుపల్లి శ్రీనివాసులు రెడ్డి దారిని అడ్డగించారు. ఈ విషయమై సోమవారం బాధిత రైతులు తహసిల్దార్‌కు తమకు న్యాయం చేయాలంటూ అతి పత్రం అందజేశారు. దారి లేక చాలా ఇబ్బంది పడుతున్నామని గుబిలి రత్తయ్య తన వినతి పత్రంలో తెలిపారు. తన భూమిలో సాగుచేసిన పశువుల మేతను సైతం తెచ్చుకునేందుకు వీలు లేకుండా దారి మూసేశారని రెండు రోజులుగా పశుగ్రాసం లేక మూగజీవాలు ఇబ్బంది పడుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. తహసిల్దార్ హేమంత్ కుమార్ పరిశీలించి, విచారించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# సమాచారహక్కు చట్టంపై అవగాహన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో సోమవారం రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమీషనర్ డాక్టర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచాహక్కు చట్టం-2005 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంలాంటిందన్నారు. ఈ సందర్భంగా షవర్ ఫాయింట్ ప్రజేంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీగోపికృష్ణ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండలంలోని బిజ్జంపల్లి మెయిన్, ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల సాధించిన మార్కులను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉమేరా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సురక్షత ప్రయాణానికి సోపానం : మంత్రి ఆనం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రోడ్డు భద్రతా సురక్షత ప్రయాణానికి సోపానమని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని మంత్రి ఆనం సూచించారు. ప్రతి ఒక్కరు కూడా రోడ్డు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటిస్తూ సురక్షతంగా తమ గమ్యస్థానాలు చేరాలని ఆయన పిలుపునిచ్చారు. మనకోసం, మన కుటుంబం కోసం, మన తోటి వారి కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి బాధ్యత అని మంత్రి ఆనం పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, ఆత్మకూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచల చౌదరి, తెలుగుదేశం నాయకులు తాళ్లూరు గిరినాయుడు, ఆనం కైవల్యారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్ రెడ్డి, పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొండ్రెడ్డి రమణారెడ్డి, షేక్ ఖాజావలి, షేక్ మస్తాన్వాలి, మద్దినేని నారాయణ,తలచిరు బాబునాయుడు, దేవరపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, గంధళ్ళ వేణు, గౌస్బెక్ష, శివకోటారెడ్డి, తహసీల్దార్ పి.పద్మజా కుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, మున్సిపల్ కమీషనర్ సి.గంగా ప్రసాద్, ఎంవిఐ రాములు, వ్యవసాయాధికారి కిషోర్ బాబు, విఆర్‌వోఆర్, కార్యాలయ, సచివాలయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ స్పాట్‌లపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో బ్లాక్ స్పాట్‌లు, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలపై జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్ల సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన 36 బ్లాక్ స్పాట్‌లలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ రక్షణ, భద్రతే ముఖ్య లక్ష్యంగా తీసుకొని, జిల్లా వ్యాప్తంగా పోలీసులు బ్లాక్ స్పాట్‌ల వద్ద స్పెషల్ డ్రైవ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్‌లలో వాహనదారులకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా హెచ్చరిక బోర్డులు, సరిపడా లైటింగ్ ఏర్పాటు, రేడియం స్టిక్కర్లు, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీసులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని, అలాగే వాహనదారులు కూడా అతి వేగం ప్రమాదకరం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. వాహనదారులు ఇంటి వద్ద తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూ ఉంటారనే విషయాన్ని గుర్తు చేసుకొని బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ప్రామాణికత కలిగిన హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని జిల్లా పోలీసులకు ఆదేశించారు. వాహనదారుల ఉల్లంఘనలైన సీటు బెల్ట్ ధరించకపోవడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్ వంటి నేరాలకు జరిమానాలు విధించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులను అప్రమత్తం చేసే విధంగా జిల్లా వ్యాప్తంగా 'ఫేస్ వాష్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్.సౌజన్య, ఎస్‌బి డిఎస్పి శ్రీనివాసరావు, సబ్ డివిజన్ పోలీసు అధికారులు, ఎస్‌బి, పిసిఆర్, డిసిఆర్బి సిఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫ్లై ఓవర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులు పరిశీలన

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వైఓ నందన్‌లు స్థానిక ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులను కార్పొరేషన్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో కలిసి సోమవారం పర్యవేక్షంచారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు అధికారులకు సూచించారు. పునరుద్ధరణ పనులలో భాగంగా అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వాహనాలతో పాటుగా పాదచారులకు అవసరమైన నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రఘునాధరావు,



ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రహమత్ జానీ, డిఈ రఘురాం, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మారుపూరు గ్రామంలో రీ–సర్వే పూర్తయిన లబ్ధిదారులకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సురేఖ పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ–సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి అవకతవకలు జరగకుండా మరుపూరు గ్రామంలో పూర్తి చేశామన్నారు. నేడు 650 మంది లబ్ధిదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందిచడం సంతోషంగా ఉందన్నారు. కలిచేటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వంలో జగన్ బొమ్మతో వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు ప్రజలు భయాందోళనకు చెందారు. మా కూటమి ప్రభుత్వంలో రాజముద్రతో ప్రతి ఒక్కరికి పట్టాదారు పాస్ పుస్తకాలు సకాలంలో అందించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా మార్పులు చేర్పులు ఉంటే సరి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కలిచేటి శ్రీనువాసులురెడ్డి, బత్తుల హరేందర్ రెడ్డి, సర్పంచ్ నాగయ్య నీటి సంఘం అధ్యక్షులు కే.శివ కుమార్‌రెడ్డి, సిహెచ్ నారాయణరెడ్డి, కే.వెంకయ్య వీఆర్వో శంకరయ్య సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పరికరాన్ని ప్రారంభించిన డిఎంహెచ్ఓ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా టీబీ కంట్రోల్ కార్యాలయంలోని ఓపి విభాగంలో ఉన్నటువంటి హ్యాండ్ హెల్డ్ ఎక్రే పరికరాన్ని నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.సుజాత, డిస్టిక్ లెపర్సీ ఎయిడ్స్ అండ్ టిబి ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఈ ఎక్రే మిషన్ ద్వారా ఐదు నుండి పది నిమిషాల్లో ఛాతి ఎక్రే తీయచ్చుని, తీసిన ఎక్రే కూడా రిసల్ట్‌ని ఐదు నిమిషాల్లో అందజేయొచ్చుని, నెల్లూరు జిల్లా అంతట ఈ పరికరాన్ని క్షత్రస్థాయిలో ఉపయోగించుకోవాలని టిబి నివారణ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి ఉన్నారని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా ఇంటెన్సిఫైడ్ టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో చాతి పరీక్షలు నిర్వహించడంలో ఈ మిషన్‌ని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా క్షయ నివారణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అకస్మాత్ తనిఖీలు నిర్వహించిన ఎంపీడీఓ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని చాగణం, గులించర్ల సచివాలయంలో సైదాపురం మండలం ఎంపీడీవో ఎంవి మోహన్‌రెడ్డి అకస్మాత్ తనిఖీలు చేశారు. సచివాలయం సిబ్బంది టైం టు టైం డ్యూటీకి వస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. అంతేకాకుండా యూనిఫైడ్ ఫ్యామిలీ బెనిఫిట్ సర్వే, సిటిజెన్, ఈ కేవైసీ సర్వే, ఇతర సర్వేల గురించి ఎంత వరకు పని చేశారన్న విషయాలపై చర్చించి మిగతా బ్యాలెన్స్ ఉన్నటువంటి వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి తెలిపారు. అనంతరంఆయన సచివాలయంలోని రికార్డులు అన్నీ కూడా పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి తెలిపారు.